# గుర్తిస్తేనే.. లాభాల పంట!

**ఏ షేరు కొనాలి? స్టాక్ మార్కెట్లో మదుపు చేయాలని చూసే వారంతా అడిగే మొదటి ప్రశ్న ఇదే. దీని సమాధానం కోసం పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఏమీ లేదు. రోజువారీ వ్యవహారాలను జాగ్రత్తగా గమనిస్తే చాలు.**




అవకాశాలు, పరిధి, అవగాహనలాంటి విషయాల్లో సంస్థాగత, సామాన్య పెట్టుబడిదారుల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. వారితో పోటీ పడే సామర్థ్యం సాధారణ మదుపర్లకు ఉండదు. పలు పెట్టుబడి సాధనాలు, అందులో ఉన్న అవకాశాలను సొంతం చేసుకోవడంలో మాత్రం సంస్థాగత మదుపుదార్లతో పోలిస్తే వ్యక్తిగత పెట్టుబడిదారులకు ఆ ప్రక్రియ సాధ్యమవుతుందనే చెప్పాలి. సంస్థాగత మదుపర్లు పెట్టుబడుదారుల నుంచి సమీకరించే మొత్తాలతో పలు రంగాల్లోని కంపెనీల్లో, వివిధ స్థాయిల వద్ద వ్యవహారాలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, సామాన్య పెట్టుబడిదారులు అవకాశాలను వెతుక్కొని, వాటిని లోతుగా, క్షుణ్నంగా అధ్యయనం చేసి లాభాలను ఆర్జించే సంస్థల్లోనే పెట్టుబడులు పెట్టవచ్చు. లేకపోతే మానేయవచ్చు.

■ ఉదాహరణకు చిన్న కంపెనీల్లో, అలాగే వివిధ వినిమయ వస్తు సేవల కంపెనీలను వాటి పనితీరును గమనిస్తూ అనువైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవచ్చు. ఈ కంపెనీల్లో ఆకర్షణీయమైన ధరల్లో మదుపు చేయడానికి మంచి అవకాశాలు ఉంటుంటాయి. ఈ కంపెనీలపై ఇంకా విశ్లేషకుల, మ్యూచువల్ ఫండ్ల, సంస్థాగత మదుపర్ల దృష్టి అంత త్వరగా పడకపోవచ్చు. కాబట్టి, ఆయా కంపెనీల షేర్లు మంచి ధరకు దొరకుతుంటాయి. అందుకే, అవకాశాల నుంచి రాబడులను ఆర్జించడానికి చిన్న మదుపరి ఏం చేయాలో ముందుగా తెలుసుకోవాలి.




**సతీష్ కంతేటి**
జెన్ మని


## వ్యవహారాల నుంచే..

అనుభవాలు మనకు ఎన్నో పాఠాలు నేర్పుతాయి. ఆర్థిక విషయాల్లోనూ అంతే. రోజువారీగా.. నిద్ర లేచింది మొదలు.. తిరిగి పడుకునే దాకా మన దైనందిన జీవితంలో ఎన్నో కంపెనీల ఉత్పత్తులను వాడుతుంటాం. సేవలను ఉపయోగించుకుంటాం. కానీ, వాటిల్లో పెట్టుబడులు పెట్టడానికి ఉండే అవకాశాలను మాత్రం మనం విస్మరిస్తాం.

■ ఒక వ్యక్తికి సంబంధించి ఒక రోజువారీ సాధారణ వ్యవహారాలను పరిశీలిద్దాం.. నిద్ర లేచిన తర్వాత న్యూస్ పేపర్ చదివి 'కోల్గేట్' టూత్ పేస్ట్, బ్రష్‌తో పళ్లు తోముకొని, 'జిల్లెట్' బ్లేడుతో షేవింగ్ చేసుకొని, 'పీఅండ్‌జీ'కి చెందిన షాంపూతో స్నానం చేశాడు. తర్వాత 'బ్రిటానియా' బిస్కట్లు లేదా 'హార్లిక్స్', 'బూస్ట్' లాంటివి తీసుకున్నాడు. తర్వాత 'జోడియాక్' బ్రాండ్ దుస్తులు, 'టైటాన్' గడియారం ధరించాడు. 'బాటా' షూస్ వేసుకొని, 'హీరోహోండా' లేదా 'మారుతీ' కారులో షాపింగ్ కాంప్లెక్స్ వెళ్లాడు. తర్వాత 'ఎయిర్‌టెల్' మొబైల్ నుంచి స్నేహితుడికి ఫోన్ చేసి 'పీవీఆర్'లో సినిమా చూశాడు.

■ ఇలా రోజువారీ వ్యవహారాల్లో అనేక కంపెనీల ఉత్పత్తులను, సేవలను మనం ఉపయోగిస్తుంటాం. మరి ఈ కంపెనీలకు, వాటి షేర్లకు ఉండే వృద్ధి అవకాశాన్ని మనం గుర్తించగలిగామా! కనీసం ఆ దిశగా కూడా ఆలోచిస్తున్నామా? అనేది గ్రహించాలి.

## గుర్తించారా?

ఉదాహరణకు రమేశ్, కుమార్ గత ఏడాది మార్చిలో ఒకేసారి 'వర్ల్‌పూల్' రిఫ్రిజిరేటర్లు కొనుగోలు చేశారు. ఒక్కో దాని ధర రూ. ఇరవై వేలు.

స్వతహాగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపించే రమేశ్ ఫ్రిజ్ తీసుకునేటప్పుడే ఆ కంపెనీలో ఉండే వృద్ధి అవకాశాన్ని అంచనా వేశాడు. వెంటనే రూ. 20 వేలను 'వర్ల్‌పూల్' షేర్లలో పెట్టుబడి పెట్టాడు. పైగా షేర్లు కూడా ఆకర్షణీయమైన ధరకు (రూ.25 చొప్పున 800) ఉన్నాయి. కుమార్ ఫ్రిజ్ పనితీరుతో సంతృప్తిగానే ఉన్నాడు. అయితే, రమేశ్‌కు మాత్రం రెండు విధాలా ప్రయోజనం అందింది. ఎందుకో తెలుసా? గత ఏడాది కాలంలో వర్ల్‌పూల్ కంపెనీ షేరు దాదాపు 10 రెట్లు పెరిగి రూ. 250 అయింది. అంటే అతడు పెట్టిన పెట్టుబడికి రూ. రెండు లక్షలు (రూ.250 చొప్పున 800 షేర్లు) వచ్చాయి.

అయితే, ఇక్కడో విషయం గమనించాలి. మనకు తెలిసిన కంపెనీల్లో పెట్టుబడి పెట్టినంత మాత్రాన అన్ని వేళలా ఇలాగే లాభాలు వస్తాయని ఆశించడం పొరపాటే. మంచి కంపెనీ దాని ఉత్పత్తి ప్రారంభ దశలో ఉన్నప్పుడు గుర్తించి, భవిష్యత్తులో దాని వృద్ధిని గుర్తుపట్టి, మదుపు చేసినప్పుడు మాత్రమే ఇలాంటి లాభాలు కళ్లచూడగలం. అవి కూడా ఆకర్షణీయమైన ధరలకే షేర్లు దొరకాలి. అప్పుడే మనం ఆశించిన ఫలితం ఉంటుంది.

■ వర్ల్‌పూల్ ఇండియా విషయానికే వద్దాం. ఆ కంపెనీ మాతృసంస్థ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వినియోగ వస్తువుల్లో ఎంతో పేరు సంపాదించింది. దాని పీఈ దాదాపు 6 రెట్లు ఉంది. ఎలాంటి అప్పులు కూడా లేవు. దాని వృద్ధి, లాభాలు కూడా ఒకే సమయంలో బాగా పెరగడం ప్రారంభించాయి. గత ఏడాది వరకూ దాని షేరు ధర కూడా మంచి ఆకర్షణీయమైన ధరలో ఉంది. ఇవన్నీ చూసే రమేశ్ అందులో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చాడు. లాభం ఆర్జించాడు. చిన్న మదుపర్లుగా మనం చూడాల్సిన విషయాలివే.

### ఆచితూచి..

కంపెనీని పూర్తిగా అర్థం చేసుకోకుండా.. అందులో ఉండే లోతుపాట్లను తెలుసుకోకుండా పెట్టుబడి పెట్టడం కూడా ఒక్కోసారి లాభనష్టాలను మిగల్చవచ్చు. ఉదాహరణకు మీరు ఏడేళ్ల కింద 'టైటాన్' వాచీ కొన్నప్పుడే దాని షేర్లను కూడా కొన్నారనుకుందాం. ఇప్పుడు అది కనీసం 40 రెట్లు వృద్ధి చెంది ఉండేది. అయితే, ఏడేళ్ల కింద 'జెట్ ఎయిర్‌వేస్'లో ప్రయాణం చేసి, మంచి సేవలు అందించారని ఆ కంపెనీ షేర్లు కొన్నారనుకుందాం. ఇప్పుడు దాదాపు 60 శాతం సొమ్మును కోల్పోయి ఉండేవారు. అందుకే కంపెనీ పూర్తి స్థాయి స్థితిగతులతో పాటు, వృద్ధి అవకాశాన్ని కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. ఉత్పత్తులు, సేవలకు భవిష్యత్తులో గిరాకీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. కంపెనీలో పెట్టుబడి పెట్టడమే కాదు. వాటిని తిరిగి తీసుకోవడం గురించి కూడా అవగాహన ఉండాలి. మన సొమ్ముకు భద్రత, దానికి రాబడి అప్పుడే సాధ్యం అవుతుంది.